క్లుప్తంగా

చర్య తీసుకోవాలి



జనగామ: పట్టణంలోని ఆదర్శ హైస్కూల్ బస్సుల్లో సెక్యూరిటీ గార్డు లేకుండా, ఓవర్ లోడ్‌తో విద్యార్థులను తీసుకు వెళ్తున్న నిర్వాహకులపై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు విద్యార్థి జేఏసీ చైర్మన్ పిట్టల సురేష్, టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్ మంగళవారం జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి జీవీఎస్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం సెక్యూరిటీ గార్డు లేక పోవడంతో ప్రైవేట్ స్కూల్ బస్సు కింద పడి విద్యార్థి చనిపోయినా మారడం లేదన్నారు. సెక్యూరిటీ పర్యవేక్షణ లేకుండా ఓవర్‌లోడ్‌తో తీసుకువెళ్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



జనగామ రూరల్: జిల్లాలో ఉన్న అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న కోరారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చొప్పరి సోమయ్య అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. శ్రీశైలం, శ్యాం కుమార్, యాకన్న, గుర్రం మధు పాల్గొన్నారు.

వ్యాధులను అరికట్టాలి



దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య సిబ్బంది కృషిచేయాలని మండల వైద్యాధికారి పూజ సూచించారు. మంగళవారం మండల ఆరోగ్య కేంద్రంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న వ్యాధులు, నివారణ చర్యల సాధ్యాసాధ్యాలు వంటి అంశాలపై చర్చించారు. వైద్యులు మనోజ్, శిరీష, వెంకటలక్ష్మి, జెసీకా, హెచ్‌వీ దయామణి, సూపర్‌వైజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వరికొయ్యలు కాల్చొద్దు



లింగాలఘణపురం: రైతులు వరి కోసిన అనంతరం కొయ్యలను కాల్చవద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఏ వసంతసుగుణ సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పటేల్‌గూడెంలో వరి పంటను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. వరి కొయ్యలను తగులబెట్టడంతో వాతావరణ కాలుష్యంతో పాటు, భూసారం పోతుందని, మేలు చేసే మిత్రపురుగులు చనిపోతాయని తెలిపారు. పొలాన్ని మొత్తం కలియదున్నితే సరిపోతుందని వివరించారు. ఏడీఏతో పాటు ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ స్పందన, రైతులు ఉన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్‌బాబు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న,మల్లికార్జున్, లక్ష్మి, వసంత, స్వరూప,మహేష్, హరిశంకర్, రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పాలకుర్తి: బమ్మెర గ్రామానికి చెందిన వంగాల శివ ఇటీవల మృతి చెందాడు. కాగా, మంగళవారం గ్రామానికి చెందిన క్రికెట్ టీం సభ్యులు రూ.12,000 నగదుతోపాటు 50 కిలోల బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. మారం రవి కుమార్, రాపాక శ్రీకాంత్, పెంతల అనిల్ కుమార్, మేడిద ప్రశాంత్, మాడ రాజు భాస్కర్ ఉన్నారు.

పల్లెలో డబుల్‌బెడ్రూం ఇళ్ల లొల్లి

- ఇళ్లలో చేరిన వలస కూలీలు
- అధికారులకు పరస్పర ఫిర్యాదు



డబుల్‌బెడ్రూం ఇంటిలో ఉన్న వలస కూలీలు

దేవరుప్పుల: గత ప్రభుత్వ హయాంలో గ్రామ సభల ద్వారా ఎంపికైన పలువురు లబ్ధిదారులు డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉండకపోగా వలస కూలీలు చేరడంతో లొల్లి మొదలైన సంఘటన మంగళవారం అప్పిరెడిపల్లెలో చోటుచేసుకుంది. మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 30 డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించారు. అప్పటి జనగామ ఆర్డీఓ మదన్‌మోహన్ పర్యవేక్షణలో గ్రామ సభల ద్వారా 28 మంది లబ్ధిదారులను గుర్తించారు. మరో రెండు ఇల్లు ఎంపిక వివాదస్పదం కావడంతో గ్రామ పంచాయతీ అట్టి ఇళ్లకు తాళం వేసి ఉంచారు. ఐతే ఎంపిక చేసిన ఇళ్లల్లో ఐదారుగురు లబ్ధిదారులు ఉండకపోగా ఇటీవల పత్తి చేను ఏరడానికి వచ్చిన వలస కూలీలు చేరడంతో వివాదం నెలకొంది. దీంతో ఎంపికకాని ఇళ్లల్లోకి గ్రామంలోని ఓ రెండు నిరుపేద కుటుంబాలు చేరడంతో ప్రతిగా మరో ఇద్దరు చేరి తాము ఉంటామనడంతో లొల్లి మొదలైంది. ఈ విషయమై కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు బాగాల మాలతిరెడ్డి, కూకట్ల కొమురయ్య, బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్ పులిగిళ్ల సుధాకర్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు బాగాల నవీన్‌రెడ్డిలు వేర్వేరుగా డబుల్ ఇళ్ల తతంగంపై తహసీల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంపిక చేసిన ఇళ్లల్లో ఉండని ఇళ్లను తిరిగి నిరుపేదలకు అందజేయాలని కాంగ్రెస్ నాయకులు అంటుండగా పెండింగ్‌లో ఉన్న రెండు ఇళ్లను నిబంధనల మేరకు ఎంపిక చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కష్టపడిన యువతకు గుర్తింపు



చైర్మన్‌ను సత్కరిస్తున్న శివసేనరెడ్డి

జనగామ: రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కష్టపడిన ప్రతి యూత్ కాంగ్రెస్ కార్యకర్తకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుర్తింపు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి అన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్‌ను మంగళవారం శివసేనరెడ్డి తన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు, డైరెక్టర్లు, కీసర దిలీప్‌రెడ్డి, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దాసరి క్రాంతి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



జనగామ: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

రఘునాథపల్లి: మండలంలోని రామన్నగూడెంలో బీఆర్‌ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ రావుల తిరుమల్‌రెడ్డి నానమ్మ నర్సమ్మ ఇటీవల మృతి చెందింది. కాగా, మంగళవారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి గ్రామానికి చేరుకుని నర్సమ్మ దశదిన కర్మలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, రెడ్కో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

తాపీ మేస్త్రీ కుటుంబానికి..

జనగామ: పట్టణంలోని ధర్మకంచకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తాపీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు తోట ప్రకాశం ఇటీవల మృతి చెందాడు. కాగా మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాపీ కార్మిక సంఘం ఐక్యత కోసం ప్రకాషం కృషి చేశారన్నారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉడుగుల నర్సింగారావును పరామర్శించి త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు మేడ శ్రీనివాస్, డైరెక్టర్ బొట్ల నర్సింగరావు, పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి చెంచారపు బుచ్చి రెడ్డి, గాదెపాక రాంచందర్, బొట్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శ్రీమన్నారాయణపురంలో..

రఘునాథపల్లి: మండలంలోని శ్రీమన్నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తిప్పారపు భాస్కర్ (45) మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్ యాదవ్ పార్టీ నాయకులతో కలిసి శ్రీమన్నారాయణపురం చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాదిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గూడ కిరణ్, శివరాత్రి రాజు, మాచర్ల శ్రీనివాస్‌గౌడ్, దేవునూరి మల్లయ్య, బాబురావు తదితరులు ఉన్నారు.

నర్సింగాపురంలో..

కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్సింగాపురం గ్రామానికి చెందిన కప్పల వీరాంజనేయులు కుటుంబాన్ని మంగళవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. సోమనర్సయ్య, రంగయ్య, శ్రీను, రమేష్, అంజయ్య, రవిందర్, ఖలీం, మనోహర్, వెంకన్న, సారయ్య ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో మంగళవారం ఉచిత షుగర్ వైద్య పరీక్షల క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 50 మందికి డయాబెటిక్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజు, వెంకటేశ్వర్లు, ఆమంచ మధుసూధన్, సంపత్, శ్రీను పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



పాలకుర్తి: ప్రమాదాల నివారణకు రోడ్డును ఆనుకుని ఉన్న ముళ్లపొదలను సీఐ జి.మహేందర్ రెడ్డి తొలగించారు. మంగళవారం మండలంలోని సిరిసన్నగూడెం నుంచి పాలకుర్తి, వల్మిడి వరకు ఉన్న ముళ్లపొదలను డోజర్‌ను ఏర్పాటు చేసి తొలగించారు. రోడ్డుకు ఆనుకుని పొదలుపెరిగే విధంగా మొక్కలు ఏర్పాటు చేయకూడదని సీఐ కోరారు.

మూలమలుపు వద్ద..



జఫర్‌గఢ్: ప్రధాన రహదారిలో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా పెరిగిన పిచ్చిమొక్కలను మండలంలోని కోనాయిచలం గ్రామానికి చెందిన యువకుడు రాగి ఎల్లారెడ్డి సొంత ఖర్చులతో మంగళవారం తొలగించాడు. స్టేషన్‌ఘన్‌పూర్–జఫర్‌గఢ్ ప్రధాన రహదారిలో మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎల్లారెడ్డి యంత్రంతో వాటిని తొలగించారు.

నవాబుపేట అంగడి వేలంలో గందరగోళం

- ఉన్నతాధికారుల సూచనల మేరకే నిర్ణయం ప్రకటిస్తామన్న అధికారులు
- డీడీలు వాపస్ తీసుకోని వేలం పాటదారులు



అంగడి వేలంలో నిర్ణయం ప్రకటించాలని అధికారులతో పట్టుబడుతున్న వేలంపాటదారులు

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట అంగడిలో పశువుల రహదారి విక్రయ హక్కు వేలం పాటలో గందరగోళం నెలకొంది. రెండుసార్లు సరైన వేలంపాట రాకపోవడంతో వాయిదా వేసి మూడోసారి మంగళవారం కలెక్టరేట్‌లో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, ఈఓ వంశీ ఆధ్వర్యంలో షీల్ టెండర్లతో పాటు బహిరంగ వేలంపాటను నిర్వహించారు. సెప్టెంబర్ 19న మొదటిసారి వేలం నిర్వహించగా రూ.79 లక్షలు, అక్టోబర్ 1న రెండోసారి రూ.80 లక్షలు రావడంతో వాయిదా వేసి మూడోసారి వేలం పాట నిర్వహించారు. 9 మంది షెడ్యూల్ ఫాం తీసుకుని నలుగురు మాత్రమే రూ.10 లక్షల ధరావత్తు (డీడీ) తీసి వేలంపాటలో పాల్గొన్నారు. అందులో నవాబుపేటకు చెందిన బూడిద రాజేశ్వర్ రూ.80,15,000లకు హెచ్చు పాటదారునిగా నిలిచాడు. గత ఏడాది వచ్చిన రూ.కోటి 5 లక్షలకు అదనంగా మరో పది శాతం ఆదాయం వస్తేనే నిబంధనల ప్రకారం వేలం పాటను అంగీకరిస్తామని అధికారులు చెప్పారు. అంగడిలో ఆదాయం తగ్గిందంటూ వేలం పాటదారులు రూ.80 లక్షల 15వేలు మించి వేలం వేయలేదు. దీంతో అధికారులు నిబంధనల మేరకు వాయిదా వేసి హెచ్చు పాటదారుని డీడీ తీసుకుని మిగిలిన వారి డీడీలు వారికి వాపస్ ఇవ్వాల్సి ఉంది. కాని వేలం పాటదారులు తమ డీడీలను వాపసు తీసుకోలేదు. ఇప్పటికే మూడుసార్లు రూ.10 లక్షల డీడీలు తీసి కమీషన్ నష్టపోతున్నామని, మూడోసారి జరిగిన వేలం పాటలో ఏదో ఒక నిర్ణయం అధికారులు ప్రకటించాలని పట్టుబట్టారు. గత ఏడాది కంటె ఎక్కువ ఆదాయం రాకపోవడంతో హెచ్చు పాటదారుని డిపాజిట్ తీసుకొని మిగిలిన వారికి డీడీలు ఇస్తామని ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి చెప్పగా అందుకు వేలంపాటదారులు అంగీకరించలేదు. దీంతో ఆమె ఉన్నతాధికారులతో ఫోన్‌లో సంప్రదించి ఉన్నతాధికారుల సూచనల మేరకు వేలం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వేలంపాటదారులు డీడీలు తమ వద్దనే ఉంచుకోండని తామే ఉన్నతాధికారుల వద్దకు వచ్చి మాట్లాడుతామని వెళ్లిపోయారు.

అక్రమాలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణ



ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు సేకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని

రఘునాథపల్లి: గతంలో పనిచేసిన రఘునాథపల్లి తహసీల్దార్ అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని ఫిర్యాదుపై మంగళవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని మండల కేంద్రంలోని తహసీల్‌లో విచారణ జరిపారు. మండలంలో మట్టిదందా, ఇసుక రవాణాను ప్రోత్సహించి తహసీల్దార్ అక్రమాలకు పాల్పడ్డారని.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రఘునాథపల్లికి చెందిన ఠాకూర్‌గ్యానేష్‌సింగ్ హైదరాబాద్‌లో ప్రిన్స్‌పల్ సెక్రటరీ (సీసీఎల్‌ఏ)కి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్రిన్స్‌పల్ సెక్రటరీ ఆదేశాల మేరకు తహసీల్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణ చేపట్టారు. విచారణలో ఫిర్యాదు దారుడు ఠాకూర్ జ్ఞానేష్‌సింగ్ నుంచి వివరాలు సేకరించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిగాయా..?, అక్రమంగా ఇసుక రవాణా జరిగిందా.. ? ఇందులో రెవిన్యూ అధికారుల పాత్ర ఉందా ..? అని ఆమె ఆరా తీశారు. డిప్యూటి తహసీల్దార్ ఉన్నారు.

తహసీల్దార్ అక్రమాలపై ఫిర్యాదు

గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన రఘునాథపల్లి మండల తహసీల్దార్ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఆదారాలు సమర్పించినట్లు సామాజిక కార్యకర్త ఠాకూర్ గణేష్‌సింగ్ మంగళవారం తెలిపారు. మండలంలోని బానాజీపేట వాగులో రఘునాథపల్లి మాజీ సర్పంచ్ అక్రమంగా ఇసుక తరలించాడని, ఈ విషయంపై పలు మార్లు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా నాటి తహసీల్దార్ పట్టించుకోలేదన్నారు. 2022లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఫిర్యాదుపై ఆదారాలు సమర్పించాలని తనకు ఈ నెల 11న జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నుంచి నోటీస్ వచ్చిందని, దీంతో తన వద్ద ఉన్న పూర్తి వివరాలను అందజేసినట్లు చెప్పారు. దాదాపు లక్ష టన్నుల ఇసుకను బానాజీపేట వాగు నుంచి తరలించారని, ఫిర్యాదు చేసినా పంచనామా కూడా చేయకుండా తహసీల్దార్ ఉదాసీనంగా వ్యవహరించాడని అధికారులకు సమర్పించిన వివరాల్లో పేర్కొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న వరంగల్‌లో నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభ సన్నాహక సదస్సుకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్‌కుమార్ పిలుపునిచ్చారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీల వర్గీకరణను దేశంలోనే మొదటిసారిగా అమలు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి మోసం చేశారన్నారు. ఇటీవల రాష్ట్రంలో భర్తీ చేసిన ఉపాధ్యాయ పోస్టులలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని, దాంతో మాదిగలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇంఛార్జీ గాదె శ్రీధర్, రవీందర్, ఏలియా, శ్రీనివాస్, అశోక్, నవీన్, యాకస్వామి, సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న టీపీయూఎస్ నాయకులు

తరిగొప్పుల: ఉపాధ్యాయుల సమస్యలపై పరిష్కారం కోసం దశలవారి ఉద్యమంలో భాగంగా టీపీయూఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గనిగంటి యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతో సమస్యలు తీరుతాయని కొండంత ఆశతో ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల ఆశలపై నీళ్లు చల్లే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. నాయకులు దొంతుల శ్రీనివాస్, బోడగమ్ సిద్ధారెడ్డి, నరేందర్, కుమారస్వామి, సుజాత, మంజుల పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ మరమ్మతు పనులు



మరమ్మతు పనులు చేయిస్తున్న లైన్‌మన్ లక్‌పతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామంలో విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఏఈ శివకుమార్ పర్యవేక్షణలో లైన్ ఇన్‌స్పెక్టర్ పెద్దిరెడ్డి, లైన్‌మన్ బానోత్ లక్‌పతి ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది పనులు చేస్తున్నారు. కార్యక్రమంలో లైన్‌మన్ బానోతు లక్‌పతి, కట్టర్ గుర్రం రాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన చిలక పోషయ్యకు మంజూరైన రూ.20వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. కార్యక్రమంలో గడ్డమీది సురేష్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, ఎడవెల్లి మల్లారెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చిన్నపెండ్యాల, కొండాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధితో పాటు మల్లంకుంట్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు తాళ్లపల్లి సమ్మయ్య గౌడ్, ఇల్లందుల యాదగిరి, గాలి రాజు, రంగు రమేష్, ఎలిశాల కనుకయ్య, బండారి వేణు,విజయ్, బుచ్చయ్య, హరిబాబు ఉన్నారు.

అన్ని పార్టీలకు అవకాశం కల్పించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కమిటీల్లో అన్ని రాజకీయ పార్టీలకు అవకాశం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో మంగళవారం సీపీఎం గ్రామకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొడెపాక యాకయ్య, గట్ల మల్లారెడ్డి, కత్తుల రాజు, మంద మహేందర్, పాలాసు పరమేష్, పిట్టల నరేందర్, రాంరెడ్డి, సోమయ్య, సతీష్, కిష్టయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సార్వత్రిక ఎన్నికలకు తరలిన ఫొటోగ్రాఫర్లు

దేవరుప్పుల: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సార్వత్రిక ఎన్నికలకు మండల ఫొటోగ్రాఫర్లు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్‌కే హుస్సేన్‌ను సన్మానించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అమృతం ఆంజనేయులు, మండల అధ్యక్షులు బానోత్ వీరు నాయక్, మండల ఉపాధ్యక్షులు ఇనుముల నాగరాజు, సలహాదారులు సతీష్, నరేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు డీఏ విడుదల చేయాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావల్సిన డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు భాస్కరుని పృథ్వీరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులకు రావాల్సిన పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'జీఓ 29తో అన్యాయం'

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఓ నంబర్ 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతుందని సేవాలాల్ విద్యార్థి సేనా జిల్లా అధ్యక్షుడు అనిల్ చౌహాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఓ 29ని రద్దు చేసి అందరికి న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సౌకర్యార్థమై గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, రైతులు మద్దతు ధరకు విక్రయించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం నాగేశ్వర్‌రావు, పిన్నింటి నారాయణరెడ్డి, కావ్యశ్రీ, బాపురెడ్డి, కనకారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆజామ్, మసూద్, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కొడకండ్ల: మండలంలోని నాలుగు గ్రామాల్లో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఏపీఎం సత్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నర్సింగాపురం, పాలకొండ, మొండ్రాయి, గిర్నితండలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని ఆయన కోరారు.

నియామకం

దేవరుప్పుల: త్వరలో జరిగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం పీఆర్‌టీయూ టీఎస్ పక్షాన మండల కోఆర్డినేటర్‌గా దేవరుప్పుల హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.మదన్‌మోహన్ రెడ్డి నియామకమైనట్లు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంబటి అంజయ్య తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల మండల మీడియా కోఆర్డినేటర్‌గా సీర్మాల హైస్కూల్ ఉపాధ్యాయులు శివగారి కిరణ్‌కుమార్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతి ఉపాధ్యాయుడు విధిగా తమ దరఖాస్తులను నవంబర్ 6వ తేదీలోపు ఎంఆర్‌సీ లేదా ఎంఆర్‌ఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

పాలకుర్తి టౌన్: జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందని తరాల మమత(30) గత కొంతకాలంగా అనార్యోగంతో బాధపడుతోంది. దీంతో తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై లింగారెడ్డి తెలిపారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

కొడకండ్ల: బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలు, అమ్మాయిలను అగౌరవ పర్చినా, అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని, కొడకండ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత మహిళను వ్యక్తి అత్యాచారం చేశాడనే ఫిర్యాదుపై ఎస్సై చింత రాజు కేసు నమోదు చేయగా విచారణ జరిపి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.